25 నుంచి పార్లమెంట్
16 బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం

న్యూఢిల్లీ, నవంబర్ 21: ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాలు అదానీ అవినీతి అంశంపై వేడెక్కనున్నాయి. ఈ సమావేశాల్లో పెండింగ్‌లో ఉన్న వక్ఫ్ సవరణ బిల్లు సహా మొత్తం 16 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఆగస్టులో సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును ఉభయ సభల జాయింట్ కమిటీ అధ్యయనం కోసం పంపారు. శీతాకాల సమావేశం ప్రారంభమైన తొలి వారం ఆఖరిరోజు ఈ నివేదిక సమర్పించాలని గతంలోనే నిర్ణయించారు. దీంతో వారు నివేదిక ఇచ్చిన అనంతరం బిల్లుకు ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదంతో జమిలి ఎన్నికలపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను మంత్రివర్గం ఇదివరకే ఆమోదం తెలిపింది. అయితే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే కొత్త బిల్లుల జాబితాలో ఇది లేకపోయినప్పటికీ ఈ సమావేశంలోనే దీనిని కూడా ప్రవేశపెడతారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఐదు కొత్త బిల్లులలో కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ద ఇండియన్ పోర్ట్స్ బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, కో-ఆపరేటివ్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్రీయ సహకార విశ్వవిద్యాలయ బిల్లు, పంజాబ్ కోర్ట్స్ (సవరణ) బిల్లు ఉన్నాయి.

ప్రయాణికులపై కాల్పులు..
50 మంది మృతి
పాక్‌లో దారుణం

పెషావర్: పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుఖ్వా ప్రావిన్స్‌లో గురువారం ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. దాదాపు 200 ప్రయాణికుల వాహనాలపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో 50 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మంది గాయపడ్డారు. ఈ సంఘటన పెషావర్-పరచినార్ మార్గంలో, కుర్రమ్ గిరిజన జిల్లాలో జరిగినట్లు ఈ ప్రావిన్స్ చీఫ్ సెక్రటరీ నదీమ్ అస్లాం చౌదరి తెలిపారు. మృతుల్లో 8 మంది మహిళలు, ఐదుగురు బాలలు ఉన్నారని చెప్పారు. మృతుల్లో అత్యధికులు షియా ముస్లింలని అధికారులు తెలిపారు. స్థానిక పాత్రికేయుని కథనం ప్రకారం, తాలిబన్ల ప్రాబల్యం గల ప్రాంతంలో ఈ దాడి జరిగింది. అఫ్గానిస్థాన్‌కు సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రాంతంలోని భూమిపై సున్నీ, షియా ముస్లింల మధ్య దశాబ్దాల నుంచి ఘర్షణ జరుగుతున్నది.

ప్రభుత్వ వైద్యమూ భారమే

- దవాఖానల్లో చార్జీలు పెంచేసిన కర్ణాటక సర్కారు
- 50 - 100% పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం
- పేద, మధ్య తరగతి ప్రజలపై పడనున్న ప్రభావం
- ఇప్పటికే పెట్రో, మద్యం, పాల ధరల పెంపు

బెంగళూరులోని విక్టోరియా దవాఖానలో పెరిగిన ధరల నోటీస్

బెంగళూరు, నవంబర్ 21: గ్యారెంటీల పేరుతో అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వరుసగా ప్రజల నడ్డి విరిచే చర్యలకు దిగుతున్నది. ఇప్పటికే పెట్రో, పాలు, మద్యం, స్టాంప్ డ్యూటీ వంటివి పెంచిన సిద్ధరామయ్య సర్కారు ఇప్పుడు ప్రభుత్వ వైద్యాన్నీ ప్రజలకు భారంగా మార్చింది. బెంగళూరు మెడికల్ కాలేజ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(బీఎంసీఆర్ఐ) పరిధిలోని ప్రభుత్వ దవాఖానల్లో చార్జీలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాదాపు 50 - 100 శాతం వరకు ధరలను పెంచేసింది. పేద, మధ్యతరగతి వర్గాలు వైద్యం కోసం ఎక్కువగా ఆధారపడే బెంగళూరులోని విక్టోరియా హాస్పిటల్, వాణి విలాస్ హాస్పిటల్, మింటో హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు ట్రామా కేర్ సెంటర్లలో వైద్య సేవలకు చార్జీలు పెరిగాయి.

వైద్య సేవల చార్జీలు రెట్టింపు

ఇప్పటివరకు రక్తపరీక్షకు రూ.70 ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.120కు ప్రభుత్వం పెంచింది. స్పెషల్ వార్డులో సింగిల్ బెడ్ చార్జీ ఒక రోజుకు రూ.750 ఉండగా ఇప్పుడు రూ.2,000కు, దవాఖాన వ్యర్థాల నిర్వహణ చార్జీలను రూ.10 నుంచి రూ.50కు, వార్డు చార్జీలను రూ.25 నుంచి రూ.50కు, ఔట్‌పేషెంట్ చార్జీలు రూ.10 నుంచి రూ.20కు, ఇన్‌పేషెంట్ చార్జీలు రూ.25 నుంచి రూ.50కు పెంచినట్టు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడానికి వారిపైనే భారం వేస్తున్నదని, వరుసగా అన్ని చార్జీలు పెంచుతున్నదని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ విమర్శిస్తున్నాయి. అయితే, చార్జీలను పెద్దగా ఏమీ పెంచలేదని, కేవలం సవరించామని వైద్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు పేర్కొన్నారు. ఇది పెద్ద విషయం కాదని, ప్రజలపై భారం కాదని చెప్పుకొచ్చారు.

కర్ణాటక కాంగ్రెస్ సర్కారు పెంచిన ధరలు

- మద్యంపై గత ఏడాది జూలైలో, ఈ ఏడాది ఫిబ్రవరిలో రెండుసార్లు ఎక్సైజ్ డ్యూటీని 10 శాతం చొప్పున పెంచింది.
- పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంచడంతో లీటరుకు రూ.3 చొప్పున ధరలు పెరిగాయి.
- ప్రభుత్వానికి చెందిన నందిని పాల ధరల లీటరుకు రూ.2 పెంచింది.

జమ్ములో కశ్మీర్ పండిట్ల దుకాణాల కూల్చివేత

- నోటీసులు ఇవ్వకుండానే చర్యలు
- నిరసన వ్యక్తం చేసిన విపక్ష పార్టీలు

జమ్ము, నవంబర్ 21: జమ్ము నగరంలో కశ్మీర్ పండిట్లకు చెందిన 12 దుకాణాలను జమ్ము డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు కూల్చివేశారు. ఎలాంటి మందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విపక్ష పార్టీలు పలుచోట్ల నిరసనలు వ్యక్తం చేశాయి. ముతీ కేంప్ ప్రాంతంలో మూడు దశాబ్దాల క్రితం కశ్మీర్ పండిట్లు నిర్మించిన ఈ దుకాణాలను అధికారులు బుధవారం కూల్చివేశారు. వారు దుకాణాలు నిర్మించిన స్థలం జమ్ము డెవలప్‌మెంట్ అథారిటీ (జేడీఏ)కి చెందినదని అధికారుల వాదన. కాగా, కూల్చివేసిన దుకాణాలను రిలీఫ్ కమిషనర్ అరవింద్ కుమార్ కర్వానీ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. కూల్చివేతల కారణంగా నష్టపోయిన కుటుంబాల వారికి అదే ప్రాంతంలో దుకాణాలను నిర్మించి ఇస్తామని హామీనిచ్చారు. కాగా, జేడీఏ చర్యలను బీజేపీ, పీడీపీ, ఆప్నీ పార్టీ, కశ్మీర్ పండిట్ సంస్థలు తీవ్రంగా నిరసించాయి. వారికి కొత్త షాపులు నిర్మించి ఇవ్వాలని, బాధితులకు జీవన భృతి కల్పించాలని డిమాండ్ చేశాయి.

కెనడాలో ఆహార సంక్షోభం

- పిల్లల కోసం తిండి మానేస్తున్న 24 శాతం మంది తల్లిదండ్రులు
- ట్రూడో ప్రభుత్వానికి సవాలుగా ద్రవ్యోల్బణం, నిరుద్యోగం

న్యూఢిల్లీ : కెనడాలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెను సవాలుగా మారాయి. తల్లిదండ్రుల్లో 24 శాతం మంది తమ పిల్లలకు కడుపు నిండా తిండి పెట్టడం కోసం తాము తినడం తగ్గించుకుంటున్నారు. సాల్వేషన్ ఆర్మీ అనే సంస్థ విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఇతర ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి పొదుపు చేయడం కోసం కిరాణా సరుకుల ఖర్చును తగ్గించుకుంటున్నామని సర్వేలో పాల్గొన్నవారిలో 90 శాతం మంది చెప్పారు. ఆర్థిక బాధ్యతలను నెరవేర్చడం కోసం తల్లిదండ్రులు తమ ఆహారాన్ని, నిత్యావసరాలను త్యాగం చేస్తున్నారు.

ఫుడ్ బ్యాంకుల్లోనూ కొరత

కెనడాలో ఉచితంగా ఆహారాన్ని పంపిణీ చేసే ఫుడ్ బ్యాంకుల్లో కూడా ఆహార కొరత ఉంది. దీంతో కొన్ని ఫుడ్ బ్యాంకులు అంతర్జాతీయ విద్యార్థులకు ఆహారాన్ని ఇవ్వకూడదని నిర్ణయించుకున్నాయి. భారతీయ విద్యార్థులు కూడా ఈ బాధితుల్లో ఉన్నారు. కిరాణా సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో జీవన వ్యయం భారీగా పెరిగింది. తమ పిల్లలకు తగినంత ఆహారం అందించడం కోసం తాము తిండి తగ్గించుకున్నామని 24 శాతం మంది తల్లిదండ్రులు చెప్పారు. పోషక విలువలు తక్కువగా ఉండే ఆహారం కాస్త చౌకగా లభిస్తుండటంతో దానినే కొంటున్నట్లు తెలిపారు. ఒక పూట తింటే, మరో పూట తినడం మానేస్తున్నట్లు 84 శాతం మంది చెప్పారు. కెనడాలో ఆర్థిక సంక్షోభానికి సంకేతం ఇదొక్కటే కాదు. ఈ సంక్షోభ సమయంలో కెనడియన్లు ఎలా జీవించగలుగుతున్నారోనని చాలా మంది సామాజిక మాధ్యమాల్లో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసరాలపై జీఎస్‌టీ సడలింపు!

వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలను ఎదుర్కొనబోతున్న ట్రూడో ప్రభుత్వానికి ఈ సమస్య సవాలు విసురుతున్నది. ప్రజలకు సాంత్వన కలిగించడం కోసం ప్రభుత్వం కోట్లాది డాలర్ల ప్యాకేజీని ప్రకటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. నిత్యావసర వస్తువులపై జీఎస్‌టీని సడలించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తున్నది. బట్టలు, నేపీస్, ప్రీ-మేడ్ హాట్ మీల్స్ వంటివాటిపై పన్నులు తగ్గిస్తారని సమాచారం. నిత్యావసర వస్తువుల ధరాభారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని ప్రజలు చాలా కాలం నుంచి కోరుతున్నారు.

ఇంజెక్షన్లకు చెల్లు

- నేరుగా జీర్ణకోశంలోనే ఔషధం విడుదల
- కొత్త కాప్సూల్స్ తయారు చేసిన ఎంఐటీ పరిశోధకులు

న్యూయార్క్, నవంబర్ 21: ఇంజెక్షన్ల అవసరం లేకుండా నేరుగా జీర్ణకోశంలోని అవయవాల్లోకి ఔషధాన్ని పంపించేందుకు సరికొత్త కాప్సూల్స్(గుళిక)ను పరిశోధకులు తయారుచేశారు. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ), డెన్మార్క్‌కు చెందిన నోవో నార్డిస్క్ అనే ఫార్మసీ సంస్థకు చెందిన పరిశోధకులు రెండు రకాలు కాప్సూల్స్‌ను అభివృద్ధి చేశారు. ఒకటి 80 మైక్రోలీటర్లు, మరొకటి 200 మైక్రోలీటర్ల ఔషధాన్ని జీర్ణకోశంలోకి తీసుకెళ్లగలవు. సాధారణంగా ఇన్సులిన్, ఆర్ఎన్ఏ ఆధారిత ఔషధాలను మాత్రల రూపంలో నోటి ద్వారా తీసుకుంటే జీర్ణకోశంలోకి వెళ్లేసరికి అవి క్షీణించిపోతాయి. అందుకే వీటిని ఇంజెక్షన్ల ద్వారా అందిస్తారు. ఈ ఇంజెక్షన్లకు ప్రత్యామ్నాయంగా జెట్ ప్రొపల్షన్ పద్ధతితో ఈ కొత్త కాప్సూల్స్‌ను తయారుచేశారు. ఈ కాప్సూల్స్ జీర్ణకోశంలోకి వెళ్లిన తర్వాతనే ఔషధాన్ని విడుదల చేస్తాయి. జంతువులపై జరిపిన ప్రయోగాల్లో ఇన్సులిన్‌తో పాటు పలు ఔషధాలను సమర్థంగా జీర్ణకోశంలోకి విడుదల చేసినట్టు తేలింది.

గూగుల్ ఏకచ్ఛత్రాధిపత్యానికి చెక్ పెట్టండి

- క్రోమ్‌ను అమ్మేసేలా ఆదేశించండి
- ఆండ్రాయిడ్‌పైనా ఆంక్షలు విధించండి
- కోర్టుకు అమెరికా న్యాయశాఖ కీలక ప్రతిపాదనలు
- ఏప్రిల్‌లో కేసును విచారించనున్న న్యాయమూర్తి అమిత్ మెహతా

వాషింగ్టన్: ఇంటర్నెట్ ప్రపంచంలో గూగుల్ ఏకఛత్రాధిపత్యానికి ముగింపు పలకాలని అమెరికా ప్రభుత్వం భావిస్తున్నది. ఈ మేరకు తీసుకోవాల్సిన చర్యలతో కూడిన 23 పేజీల డాక్యుమెంట్‌ను యూఎస్ న్యాయశాఖ తయారుచేసింది. వాషింగ్టన్ డీసీ కోర్టులో ఈ పత్రాన్ని బుధవారం దాఖలు చేసింది. గూగుల్ది ఏకఛత్రాధిపత్యం అని ఆగస్టులో వాషింగ్టన్ డీసీ కోర్టు న్యాయమూర్తి అమిత్ మెహతా పేర్కొన్నారు. దీంతో గూగుల్‌పై చర్యలు తీసుకోవాలని జో బైడెన్ ప్రభుత్వం భావిస్తున్నది. ఏప్రిల్‌లో ఈ కేసు విచారణ ప్రారంభం కానున్న నేపథ్యంలో గూగుల్‌పై తీసుకోవాల్సిన చర్యలను కోర్టుకు ప్రతిపాదించింది. గూగుల్‌కు చెందిన క్రోమ్ వెబ్ బ్రౌజర్‌ను విక్రయించేలా ఆదేశాలు ఇవ్వాలని, సొంత సెర్చ్ ఇంజిన్‌కు మేలు చేయకుండా ఆండ్రాయిడ్‌పై ఆంక్షలు విధించాలని న్యాయమూర్తికి విజ్ఞప్తి చేసింది. క్రోమ్ బ్రౌజర్‌ను విక్రయిస్తే కీలకమైన సెర్చ్ యాక్సెస్ పాయింట్‌పై గూగుల్ నియంత్రణ శాశ్వతంగా ఆగిపోతుందని, ప్రత్యర్థి సెర్చ్ ఇంజిన్లకు క్రోమ్‌లో స్థానం లభిస్తుందని న్యాయశాఖ లాయర్లు కోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో సెప్టెంబర్ 1న 'లేబర్ డే' లోపు న్యాయమూర్తి తీర్పు ఇవ్వనున్నారు.

16 ఏండ్లలోపు వారికి సోషల్ మీడియా నిషేధం

- ప్రపంచంలోనే తొలిసారిగా ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో బిల్లు

సిడ్నీ: 16 ఏండ్ల లోపు వారు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా నిషేధాన్ని విధిస్తూ కొత్త చట్టాన్ని ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టారు. సోషల్ మీడియా వినియోగంపై ఇలా నిషేధం విధిస్తూ ఒక దేశం బిల్లు తేవడం ప్రపంచంలోనే తొలిసారి. అలాగే 18 ఏండ్ల లోపు యువత ఆన్‌లైన్ పోర్నోగ్రఫీ వీక్షణపై నిషేధం విధించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం యోచిస్తున్నది. 21వ శతాబ్దపు సవాళ్లకు 20వ శతాబ్దపు స్పందన తప్పదని డిజిటల్ ఇండస్ట్రీ అడ్వకేట్ ఒకరు వ్యాఖ్యానించారు. ఆన్‌లైన్ భద్రత అనేది తల్లిదండ్రులకు కష్టతరమైన సవాళ్లలో ఒకటని ఆ దేశ ప్రసార శాఖ మంత్రి మేఖేల్ రౌలాండ్ పేర్కొన్నారు. 16 ఏండ్ల లోపు పిల్లల సామాజిక మాధ్యమ ఖాతాలను నిరోధించడంలో వ్యవస్థాగతంగా విఫలమైతే సామాజిక మాధ్యమాలకు 33 మిలియన్ అమెరికా డాలర్ల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఐఎస్‌బీతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న రామోజీ ఫౌండేషన్ ట్రస్టీ కిరణ్, ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ చైర్మన్ హరీశ్ మన్వానీ తదితరులు

ఐఎస్‌బీకి రామోజీ ఫౌండేషన్ 30 కోట్ల విరాళం

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)కు రామోజీ ఫౌండేషన్ భారీ విరాళం ప్రకటించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రామోజీ ఫౌండేషన్ ట్రస్టీ సీహెచ్ కిరణ్ గురువారం రూ.30 కోట్ల విరాళం అందజేశారు. హైదరాబాద్ క్యాంపస్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ఈ మొత్తాన్ని వినియోగిస్తామని ఐఎస్‌బీ తెలిపింది. ఈ మొత్తంతో 430 సీట్ల సామర్థ్యంతో ఆధునిక ఆడిటోరియం నిర్మిస్తామని పేర్కొన్నది. ఈ సందర్భంగా ఐఎస్‌బీ బోర్డు చైర్మన్ హరీశ్ మన్వానీ, డీన్ మదన్ పిల్లుట్ల రామోజీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దాతల ఉదారతతో ఐఎస్‌బీ ప్రపంచ స్థాయి విద్య, పరిశోధనా సంస్థగా అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. రామోజీరావుకు విద్యాభివృద్ధిపై ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని రామోజీ ఫౌండేషన్ ట్రస్టీ కిరణ్ తెలిపారు. ఈ విరాళంతో విద్యార్థులకు ప్రపంచస్థాయి సదుపాయాలు కల్పించనున్నట్టు ఆశాభావం వ్యక్తంచేశారు.

మార్కెట్లకు అదానీ షాక్

అమ్మకాల ఒత్తిడిలోకి మదుపరులు

ఒక్కరోజే గ్రూప్ విలువ రూ.2.20 లక్షల కోట్లు ఆవిరి
లంచం, నేరారోపణలతో 23% వరకు నష్టపోయిన కంపెనీల షేర్లు

ముంబై, నవంబర్ 21: సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకోవడానికి అదానీ గ్రూప్‌పై వచ్చిన దాదాపు రూ.2,240 కోట్ల (265 మిలియన్ డాలర్లు) లంచం ఆరోపణలు గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లను ఒక్కసారిగా కుదిపేశాయి. దీంతో అదానీ సంస్థల షేర్లన్నీ భీకర నష్టాలకు లోనయ్యాయి. ఫలితంగా ఈ ఒక్కరోజే రూ.2.20 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైపోయింది. ఇది గత ఏడాది హిండెన్‌బర్గ్ రిపోర్ట్ కారణంగా గ్రూప్ సంస్థలకు వచ్చిన నష్టాల కంటే రెట్టింపునకుపైగా ఉండటం గమనార్హం.

ఏడాది కనిష్ఠానికి..

ఈ కేసులో అమెరికాలో గౌతమ్ అదానీపై అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో మదుపరులు ఆయనకు చెందిన కంపెనీల నుంచి పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. దీంతో ఆయా కంపెనీల షేర్ల విలువ వేగంగా పడిపోయింది. ఇలా మొత్తం 10 సంస్థల మార్కెట్ విలువ రూ.2,19,878.35 కోట్లు కరిగిపోయింది. ఈ క్రమంలో గడిచిన కొన్ని వారాలుగా భారీగా పుంజుకున్న అదానీ గ్రూప్ షేర్లకు గురువారం పెద్ద దెబ్బే తగిలినట్టైంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ విలువ అత్యధికంగా 22 శాతానికిపైగా నష్టపోయింది.

క్రెడిట్ రేటింగ్‌కు దెబ్బ

లంచాలకు సంబంధించి గౌతమ్ అదానీపై వచ్చిన నేరారోపణలు అదానీ గ్రూప్ క్రెడిట్ రేటింగ్‌ను ప్రభావితం చేస్తాయని క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ తెలిపింది. ఈ క్రమంలోనే ఇకపై అదానీ గ్రూప్ నిధుల సమీకరణకు వెళ్తే.. దాని సంస్థల ఆర్థిక స్థితిగతులను మదింపుచేటప్పుడు ఆయా కంపెనీల్లోని పాలనాపరమైన అంశాలనూ తప్పకుండా లోతుగా పరిశీలిస్తామని గురువారం మూడీస్ స్పష్టం చేసింది. 'ముడుపులపై అదానీ గ్రూప్ చైర్మన్, ఇతర సీనియర్ అధికారులపై వచ్చిన నేరారోపణలు.. ఆ గ్రూప్ కంపెనీల రుణ పరపతిని దిగజారుస్తాయి' అని మూడీస్ రేటింగ్స్ పేర్కొన్నది.

షేర్ల పతనం ఇలా..

సంస్థ	పతనం (శాతంలో)
అదానీ ఎంటర్‌ప్రైజెస్	22.61
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	20
అదానీ గ్రీన్ ఎనర్జీ	18.80
అదానీ పోర్ట్స్-సెజ్	13.53
అంబుజా సిమెంట్	11.98
అదానీ టోటల్ గ్యాస్	10.40
అదానీ విల్మర్	9.98
అదానీ పవర్	9.15
ఏసీసీ	7.29
ఎన్‌డీటీవీ	0.06

ఎల్ఐసీకి రూ.8,567 కోట్ల నష్టం

దేశీయ ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీకి గట్టి ఎదురుదెబ్బే తగిలింది. అదానీ గ్రూప్ సంస్థల్లో అత్యధికంగా పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీకి.. తాజా పరిణామాలతో ఏకంగా రూ.8,500 కోట్లకుపైగా నష్టం వాటిల్లింది మరి. ఏసీసీ లిమిటెడ్, అదానీ టోటల్ గ్యాస్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్, అంబుజా సిమెంట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌లో 1.36 శాతం నుంచి 7.86 శాతం వరకు ఎల్ఐసీకి వాటాలున్నాయి. మంగళవారం స్టాక్ మార్కెట్ ముగిసే నాటికి రూ.54,861 కోట్లుగా ఉన్న అదానీ గ్రూప్ స్టాక్స్‌లో ఎల్ఐసీ పెట్టుబడులు.. గురువారం మార్కెట్ ముగిసే నాటికి రూ.46,294 కోట్లకు పరిమితమయ్యాయి.

ఎల్ఐసీకి అదానీ గ్రూప్ సంస్థల్లోగల వాటాల వివరాలు

సంస్థ	వాటా (శాతంలో)
అదానీ ఎంటర్‌ప్రైజెస్	4.07
ఏసీసీ	6.39
అదానీ టోటల్ గ్యాస్	6.02
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	2.78
అంబుజా సిమెంట్స్	5.07
అదానీ పోర్ట్స్-సెజ్	7.86
అదానీ గ్రీన్ ఎనర్జీ	1.36

వాణిజ్య

ఒత్తిడిలో ఫండ్స్

అదానీ గ్రూప్ సంస్థల్లో మ్యూచువల్ ఫండ్స్ కంపెనీలు రూ.43వేల కోట్లకుపైగా పెట్టుబడులను పెట్టాయి. దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన 10 అదానీ గ్రూప్ సంస్థల్లో మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీకి చెందిన ఆస్తులు గత నెల అక్టోబర్ 31 నాటికి రూ.43,456 కోట్లుగా ఉన్నాయి. ఎన్‌డీటీవీ మినహా మిగతా అన్ని అదానీ సంస్థల్లో మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ఇన్వెస్ట్ చేశాయి. దీంతో ప్రస్తుతం ఈ పెట్టుబడులన్నీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

తప్పించుకోలేదు..

గౌతమ్ అదానీ, మరికొందరిపై వచ్చిన నేరారోపణలు తీవ్రమైనవేనని, వీటివల్ల అదానీ గ్రూప్‌నకు ఆర్థికంగా, పరపతిపరంగా ఇబ్బందులు తప్పకపోవచ్చని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఈ వ్యవహారంలో సెటిల్మెంట్‌కు అవకాశాలున్నా.. అమెరికా కోర్టులోనే అదానీ గ్రూప్ పోరాడాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలోనే గత ఏడాది హిండెన్‌బర్గ్ కేసులో భారతీయ కోర్టుల నుంచి వచ్చిన ఉపశమనం మాదిరే అమెరికా కోర్టుల నుంచీ వస్తుందనుకోవద్దని, అక్కడి చట్టాలు చాలాచాలా కఠినంగా ఉంటాయని పేర్కొంటున్నారు. లంచాల ఆరోపణల నుంచి తప్పించుకున్నా.. క్రిమినల్ ఆరోపణల నుంచి బయటపడటం అంత ఈజీ కాదని తెలియజేస్తున్నారు. ఇదిలావుంటే ఈ కేసులో అవసరమైన అన్ని న్యాయపరమైన చర్యలు, సహాయం తీసుకుంటామని, ఇవన్నీ నిరాధార ఆరోపణలేనని అదానీ గ్రూప్ అధికార ప్రతినిధి ఒకరు అన్నారు.

జియో, ఎయిర్‌టెల్‌లకు షాక్

- సెప్టెంబర్‌లో కోటి మంది మొబైల్ కస్టమర్లు గుడ్‌బై
- బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌పరిధిలోకి మరో 8.5 లక్షలు

న్యూఢిల్లీ, నవంబర్ 21: ప్రైవేట్ టెలికం దిగ్గజాలకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. టారిఫ్‌లను పెంచిన నాటి నుంచి వరుసగా మొబైల్ సబ్‌స్క్రైబర్లను కోల్పోతున్న రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు సెప్టెంబర్ నెలలోనూ ఏకంగా కోటి మంది వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు కోల్పోయారు. ఇదే సమయంలో ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు మాత్రం 8.5 లక్షల మంది మొబైల్ యూజర్లు చేరారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. సెప్టెంబర్ నెలలో రిలయన్స్ జియో 79.69 లక్షల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లను కోల్పోగా, భారతీ ఎయిర్‌టెల్ 14.34 లక్షల యూజర్లు, వొడాఫోన్ ఐడియా నెట్‌వర్క్ నుంచి 15.53 లక్షల మంది వెళ్లిపోయారు. సెప్టెంబర్ చివరి నాటికి జియో మొబైల్ సబ్‌స్క్రైబర్లు 46.37 కోట్లు, ఎయిర్‌టెల్‌కు 38.34 కోట్లు, వొడాఫోన్ ఐడియా 21.24 కోట్ల మంది ఉన్నారు. అలాగే ఇదే సమయంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ కింద 9.18 కోట్ల మంది ఉన్నారు. జూలై నెలలో మొబైల్ టారిఫ్ చార్జీలను 10-27 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రైవేట్ టెలికం దిగ్గజాలు ప్రకటించాయి. దీంతో మొబైల్ కస్టమర్లు బీఎస్ఎన్ఎల్ బాట పట్టారు.

అసెండియాన్ ఏఐ స్టూడియో

హైదరాబాద్, నవంబర్ 21: ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ సేవల సంస్థ అసెండియాన్..హైదరాబాద్‌లో ఏఐ స్టూడియోను ప్రారంభించింది. దేశంలో సంస్థ ఏర్పాటు చేసిన రెండో స్టూడియో ఇదే కావడం విశేషం. ఏఐ ఆవిష్కరణలు, వాస్తవ ప్రపంచ పరిష్కారాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ స్టూడియోలను నెలకొల్పినట్లు కంపెనీ సీఈవో కృష్ణమూర్తి తెలిపారు. భవిష్యత్తు వ్యాపారంలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషించనున్నదని, క్లయింట్లకు సేవలు అందించడానికి వీలుపడనున్నదన్నారు.

మంగోల్ రిఫైనరీకి మేఘా వెస్సెల్స్

హైదరాబాద్, నవంబర్ 21: మంగోలియా దేశంలో నిర్మిస్తున్న మంగోల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీకి అవసరమైన కీలక పరికరాలైన వెస్సెల్స్ ఎగుమతిని ప్రారంభించినట్లు మేఘా ఇంజినీరింగ్ ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లోని మెయిల్ వెస్సెల్ తయారీ విభాగంలో జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.

హైదరాబాద్‌లో
రఘు వంశీ ప్లాంట్

హైదరాబాద్, నవంబర్ 21: క్రిటికల్ విడిభాగాల తయారీ సంస్థ రఘు వంశీ గ్రూప్..హైదరాబాద్‌లో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నది. రూ.300 కోట్ల పెట్టుబడితో హార్డ్‌వేర్ పార్క్‌లో ఎనిమిది ఎకరాల స్థలంలో నిర్మితలపెట్టిన ప్లాంట్‌నకు గురువారం భూమి పూజ చేసింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘు వంశీ గ్రూపు ఎండీ వంశీ వికాస్ మాట్లాడ